సాక్షి
జగిత్యాల
బుధవారం ◆ 19 ◆ ఏప్రిల్ ◆ 2023



అంజన్నకు మొక్కులు

కొండగట్టు : కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని మంగళవారం వేలాది మంది భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



ఎంపీ అర్వింద్‌తో భేటీ

జగిత్యాల: నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు మంగళవారం నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.0/26.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటిపూట ఉక్కపోతగా ఉండి, ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

అగ్ని కలపను భస్మీపటలం చేసినట్లు ఈర్ష్య సత్కారాలను స్వాహా చేస్తుంది.
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
బుధ 6.36	గురు 4.29

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

అభివృద్ధి పనులపై ఆరా



పంచాయతీ కార్యాలయం వద్ద ప్రతినిధులు

కోరుట్లరూరల్: హైదరాబాద్‌కు చెందిన యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సభ్యులు మంగళవారం నాగులపేట గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. నీతినిజాయితీతో పనిచేస్తున్న సర్పంచులను గుర్తించి తమ సంస్థ ద్వారా సత్కరిస్తున్నామని వారు తెలిపారు. అందులో భాగంగా 2022లో స్థానిక సర్పంచ్ కేతిరెడ్డి భాస్కర్‌రెడ్డిని సత్కరించామని గుర్తుచేశారు. గ్రామాభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని డాక్యుమెంటరీ ద్వారా ప్రజలకు తెలియజేస్తామన్నారు. గాంధీజీ ఆశయాల మేరకు యూత్ ఫర్ యాంటీ కరప్షన్ వినూత్న కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. సంస్థ ఫౌండర్ పల్నాటి రాజేంద్ర, సర్పంచ్ కేతిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సలహాదారులు నన్నపనేని అశోక్ కుమార్, జాతీయ కార్యవర్గ సభ్యులు మరియా ఆంటోని, హరిప్రకాశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నీరు విడుదల చేయండి



మాట్లాడుతున్న రైతు నాయకులు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు సాగునీటి నిలిపివేయడంతో చేతికొచ్చే దశకు వస్తున్న సజ్జ, నువ్వులు, వరి పంటలు ఎండిపోయే ప్రమాదం తలెత్తిందని, దీనిని దృష్టిలో పెట్టుకుని సాగునీరు విడుదల చేయాలని రైతు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నల్ల రమేశ్ కోరారు. రైతులతో కలిసి ఆయన మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కాకతీయ కాలువకు వచ్చే లీకేజీ నీటిని కూడా నిజామాబాద్ జిల్లా ఉప్లూర్ వద్ద అక్కడి రైతులు గేట్లు మూసివేసి రాకుండా చేశారని ఆరోపించారు. ఈ విషయంపై ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదన్నారు. ఇంకా మూడు తడుల నీరు విడుదల చేస్తే పంటలు చేతికి వస్తాయని, ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు భూమరెడ్డి, నర్సరెడ్డి, వెంకటరెడ్డి, బద్దం సత్యరెడ్డి, తీగల విక్రమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుజదోష నివారణ పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో మంగళవారం కుజ దోష నివారణ పూజలు నిర్వహించారు. ఈ పూజలు చేస్తే.. కుటుంబ కలహాలు, వాస్తుదోషాలు, ఆర్థిక ఇబ్బందుల నుంచి విముక్తి లభిస్తుందని అర్చకులు భక్తులకు వివరించారు.

ఏదీ సుందరీకరణ?



- ఇది నిర్మాణంలోఉన్న గ్రంథాలయ భవనం. సుందరీకరణ నిధుల నుంచి రూ.50లక్షలు దీనికోసం వెచ్చించి మూడేళ్లక్రితం పనులు చేపట్టారు. స్లాబ్ వరకు పూర్తిచేశారు. నిధుల కొరతతో రెండేళ్లుగా పనులు సాగడంలేదు. ఇటీవల మరో రూ.50 లక్షలు కేటాయించారు. టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదు. పాత మండల పరిషత్ కార్యాలయంలోని ఓ గదిలో లైబ్రరీ నిర్వహిస్తున్నారు. అది ఇరుకుగా ఉంది. వసతులువు. పాఠకులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.



ఇది జాతీయ రహదారి చెంతనే ఉన్న మురుగునీటి కాలువ. సుందరీకరణ నిధులు వెచ్చించి రోడ్డుకు ఇరువైపులా నాలుగేళ్ల క్రితం డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. కాంట్రాక్టర్ పనులను అసంపూర్తిగా వదిలేశారు. చాలాచోట్ల తవ్విన గుంతలు అలాగే ఉన్నాయి. మురుగు నీరు దిగువకు వెళ్లకుండా గుంతల్లోనే నిలిచిపోతోంది. తద్వారా వచ్చే దుర్వాసన, దోమలతో వ్యాపారులు, స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు.

- నాలుగేళ్లక్రితం పనులు ప్రారంభం
- ఒక్కో బల్దియాకు రూ.50కోట్లు
- నిధులు సరిపోక ఆగిన పనులు
- పట్టణవాసులకు తప్పని తిప్పలు

మెట్‌పల్లి(కోరుట్ల): జిల్లాలోని జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల మున్సిపాలిటీలను అన్నివిధాలా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం ఒక్కో పట్టణానికి రూ.50కోట్లు మంజూరు చేసింది. సుందరీకరణ పేరిట గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు పనులు ప్రారంభించారు. ఇప్పటికీ వాటిని పూర్తిచేయలేయపోయారు. కారణాలు ఏమైనా నాలుగేళ్లుగా పనులు పూర్తికాకపోవడంపై బల్దియావాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మెట్‌పల్లిలో 24పనులు

మెట్‌పల్లి పట్టణ సుందరీకరణ కోసం 24 పనులు చేపట్టాలని ప్రణాళిక రూపొందించారు. వీటిని మున్సిపల్, పబ్లిక్ హెల్త్, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్ శాఖలకు అప్పగించారు. ఇప్పటివరకు ఏడు పనులే పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మరికొన్ని వివిధ దశల్లో ఉండగా, ఇంకొన్నింటిని ఇప్పటికీ ప్రారంభించకపోవడం గమనార్హం.

పనుల్లో జాప్యంతో సమస్యలు

- మెట్‌పల్లిలోని జాతీయ రహదారిపై రూ.11కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం ఉంది. కాంట్రాక్టర్ పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. చాలాచోట్ల గుంతలు తవ్వి అలాగే వదిలేశారు. గత్యంతరంలేక కొందరు వ్యాపారులు తమ దుకాణాల ఎదుట సొంత ఖర్చులతో పనులు పూర్తిచేసుకున్నారు.
- బల్దియా వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. ఇప్పటివరకు కొన్నిచోట్ల మాత్రమే పనులు పూర్తిచేశారు. చాలాచోట్ల సీసీ రోడ్లను నిర్మించకపోవడంతో వర్షాకాలంలో రోడ్లు బురదగా మారి నడవలేని దుస్థితితో ప్రజలు సతమతమవుతున్నారు.

మెట్‌పల్లి బల్దియా సమాచారం	
మొత్తం పనులు	24
పూర్తయినవి	07
ప్రగతి దశలోఉన్నవి	13
అసలే ప్రారంభం కానివి	04

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి యువకుడు బలి..

కాంట్రాక్టర్లు సకాలంలో పనులను పూర్తిచేయకపోవడంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జాతీయ రహదారికి ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్.. కొన్నిచోట్ల పైకప్పులు వేయలేదు. దీంతో కొత్తబస్టాండ్ వద్ద ఇటీవల ఓ యువకుడు రాత్రి ప్రమాదవశాత్తు డ్రైనేజీలోపడి మృతిచెందాడు.

బిల్లులు రాకపోవడమే కారణం..?

బిల్లుల విడుదలతో జాప్యంతోనే కాంట్రాక్టర్లు సుందరీకరణ పనులను అర్ధంతరంగా ఆపేశారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణాభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కేటాయించిన ప్రభుత్వం .. చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో కొన్ని పనులకు చాలాసార్లు టెండర్లు పిలుస్తున్నా.. కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలిసింది.

నిర్లక్ష్యం తగదు

బీడీ కాలనీలో షాదీఖానా పనులు అర్ధంతంగా నిలిపివేశారు. బిల్లు రావడం లేదని కాంట్రాక్టర్ ఇలా చేయడం తగదు. దశాబ్దానికిపైగా మైనార్టీలు షాదీఖానా కోసం ఎదురు చూస్తున్నారు. మా కల నెరవేర్చాలి.
– ఖుత్బొద్దీన్, సుల్తాన్‌పురా, మెట్‌పల్లి

చర్యలు తీసుకోవాలి

గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు సుందరీకరణ పనులు ప్రారంభించారు. మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఇప్పటికీ పనులు పూర్తిచేయలేదు. జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలి.
– బొడ్ల రమేశ్, సుభాష్‌నగర్, మెట్‌పల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

సుందరీకరణ పనుల్లో జాప్యంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి పనులు పూర్తిచేయాలని సూచిస్తాం. లేకుంటే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటాం.
– జగదీశ్వర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, మెట్‌పల్లి

మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యం

- 3,729 మహిళా సంఘాలకు రూ.6.90 కోట్ల వడ్డీమాఫీ
- రాష్ట్ర సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్



చెక్కు అందిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: మహిళ ఆర్థికాభివృద్ధికి సీఎం కేసీఆర్ అనేక పథకాలు చేపడుతున్నారని, వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం నియోజకవర్గస్థాయిలోని మహిళా సంఘాలకు వడ్డీమాఫీ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గత ఎనిమిదేళ్లలో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుంచిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని అన్నారు. మహిళలు ఆర్థికంగా ముందుకుసాగడానికి బ్యాంకుల ద్వారా విరివిగా రుణాలు అందిస్తున్నారని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకుంటూ మహిళా సంఘాలు సకాలంలో రుణవాయిదాలు చెల్లిస్తున్నాయని అభినందించారు. మహిళలు చెల్లించిన రెండేళ్ల వడ్డీ సొమ్మును బ్యాంకుల్లో జమచేశామని తెలిపారు. ఇందులో భాగంగానే నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 3,729 మహిళా సంఘాలకు రూ.6.90కోట్ల వడ్డీమాఫీ సొమ్మును మహిళల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమచేశామని మంత్రి తెలిపారు. గతంలో రూ.5లక్షల వరకు రుణ సౌకర్యం ఉండేదని, ప్రస్తుత ప్రభుత్వం దానిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు పెంచిందని అన్నారు. ఈ సొమ్ము ద్వారా కుటీర పరిశ్రమలు స్థాపించుకోవాలని మహిళా సంఘాలకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీవైస్‌చైర్‌పర్సన్ దావ వసంత, అడిషనల్ కలెక్టర్ మకరంద్, డీసీఎమ్మెస్ చైర్మన్, శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ జెడ్పీటీలు చిట్టిబాబు, బాదినేని రాజమణి, బాదినేని రాజేందర్, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, డీఆర్డీఏ పీడీ లక్ష్మీనారాయణ, జిలా సంక్షేమాధికారి నరేశ్, మెప్మా అధ్యక్షురాలు సునీత తదితరులు పాల్గొన్నారు.

పోయిన సెల్‌ఫోన్ దొరుకుతుంది!

- ఆ సెల్‌ఫోన్ పనిచేయదు, కొత్త సిమ్ వేస్తే తెలిసిపోతుంది..
- సీఈఐఆర్ సాంకేతికతపై రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులకు శిక్షణ
- కరీంనగర్‌లో తొలిసారిగా ప్రయోగాత్మకంగా పరిశీలన
- ఇప్పటికే పలు ఫోన్లను పట్టుకున్న రూరల్ పోలీసులు
- మీరు కొన్నది దొంగ ఫోనా? కాదా? తెలిసిపోతుంది
- త్వరలో సామాన్యులకు సైతం విస్తృత అవగాహన

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కొంతకాలంగా సెల్‌ఫోన్ల చోరీలు పెరిగిపోతున్నాయి. ఫోన్ పోగొట్టుకున్న వారంతా పోయిన ఫోన్ కంటే కూడా అందులో ఉండే డేటా కోసం ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఈ రోజుల్లో విద్య, వ్యాపారం, ఉద్యోగం, ఆరోగ్యం, బ్యాంకింగ్, రాజకీయ సమావేశాలు ఇలా ప్రతీ సమాచారాన్ని సెల్‌ఫోన్ నుంచే నిర్వహిస్తున్నారు. కరోనా తరువాత డేటా వినియోగం పెరిగింది. విద్యార్థుల నుంచి ముసలివారి దాకా స్మార్ట్ ఫోన్‌ల వినియోగం ముమ్మరంగా మారింది. ఈ క్రమంలో తమ వ్యక్తిగత, వృత్తిగత సమాచారాన్ని పలు సాఫ్ట్ కాపీల రూపంలో ఫోన్‌లోనే భద్రపరుచుకుంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే మన దైనందిక జీవితంలో ఫోన్ కీలకంగా మారింది. అంతటి కీలకమైన ఫోన్‌ను పోగొట్టుకున్నా.. లేక చోరీకి గురైనా ఏంటి పరిస్థితి? అమ్మో..! అస్సలు ఆ పరిస్థితినే ఊహించుకోలేని స్థితికి చేరుకున్నాం. అంతటి కీలకమైన స్మార్ట్‌ఫోన్ పోయినా.. పోగొట్టుకున్నా.. అందులో డేటా తస్కరణకు గురైతే పలు సున్నితమైన విషయాలు బయటికి వచ్చే ప్రమాదం కూడా ఉంది. అందుకే.. ఇకపై అలాంటి చిక్కులు లేకుండా తెలంగాణ పోలీసులు వినూత్న సాంకేతికతను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఇందులో భాగంగా కరీంనగర్ కమిషనరేట్‌లో ఈ విధానం ప్రయోగాత్మకంగా అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికే పోగొట్టుకున్న రెండు మొబైల్స్‌ను పట్టుకున్న పోలీసులు తిరిగి వాటిని యజమానులకు అప్పగించారు.

సీఈఐఆర్ సాంకేతికత ద్వారా..!

డిపార్ట్‌మెంటు ఆఫ్ టెలీ కమ్యూనికేషన్స్ ఆధ్వర్యంలో సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్ (సీఈఐఆర్) సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా పోయిన సెల్‌ఫోన్‌ను తిరిగి కనిపెట్టే సాంకేతికతను పరిచయం చేస్తున్నారు. ఈ సాంకేతికతను ఉపయోగించి సీఈఐఆర్ వెబ్‌సైట్ ఓపెన్ చేసి బ్లాక్ చేయవచ్చు. సీఈఐఆర్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి సెల్‌ఫోన్‌ను ఐఎంఈఐ నెంబరు సాయంతో బ్లాక్ చేయవచ్చు. ఈ తరువాత ఆ సెల్‌ఫోన్ ఎట్టి పరిస్థితుల్లోనూ పనిచేయదు. ఒకవేళ ఫోన్ ఆన్‌చేసి, అందులో కొత్త సిమ్‌కార్డు వేసినా.. ఆ విషయం ఫోన్ యజమానికి ఎస్ఎంఎస్ ద్వారా తెలిసిపోతుంది.

ఎలా పనిచేస్తుంది?

- సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు వెంటనే.. https://www.ceir.gov.in పోర్టల్ ఓపెన్ చేయాలి. అందులో బ్లాక్ ఫోన్ అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
- అందులో మొబైల్ నెంబర్-1, మొబైల్ నెంబరు-2, సెల్‌ఫోన్ బ్రాండ్, మోడల్, ఇన్వాయిస్ (బిల్) ఫొటో సూచించిన గడుల్లో నింపాలి.
- పోగొట్టుకున్న స్థలం, పోయిన తేదీ, ఇతర చిరునామాలు, అంతకుముందే ఇచ్చిన పోలీస్ కంప్లయింట్ నెంబరు, ఫోన్ యజమాని చిరునామా, ఈమెయిల్ ఐడీ, ధ్రువీకరణ కార్డులు, చప్టాలను సూచించిన బాక్సుల్లో నింపాలి.
- వెంటనే మీ సెల్‌ఫోన్ (పాత నెంబరు మీద తీసుకున్న కొత్త సిమ్) నెంబరుకు ఓటీపీ వస్తుంది.
- ఓటీపీ ఎంటర్ చేసిన తరువాత ఫామ్‌ను సబ్మిట్ చేయాలి. ఆ తరువాత ఫోన్ దానంతట అదే బ్లాక్ అవుతుంది. ఇకపై దాన్ని ఎవరూ ఆపరేట్ చేయలేరు. దానిలోని డేటా సురక్షితంగా ఉంటుంది. ఒకవేళ దొంగిలించిన వ్యక్తి లేదా సెకండ్ హ్యాండ్‌లో కొన్న వ్యక్తి సిమ్ వేయగానే.. మీ నెంబరుకు మెసేజ్ వస్తుంది.
- ఆ సందేశం ఆధారంగా ఫోన్ ఎక్కడ ఉన్నా.. పట్టుకోవడం సులభతరంగా మారుతుంది.



పెద్దపల్లి జిల్లాకు చెందిన బొడ్డ రమేశ్‌కు మొబైల్ ఇస్తున్న సీపీ

అన్‌బ్లాక్ చేయండిలా..!

- మీ ఫోన్‌ను పోలీసులు పట్టుకున్నా.. లేక మీకే దొరికినా.. మీ పాత ఐడీని, ఫోన్‌నెంబరు, ఇతర వివరాలు నింపిన తరువాత ఫోన్‌ను అన్‌బ్లాక్ చేసుకోవచ్చు.

ఐఎంఈఐ నెంబరు తెలియకపోతే?

ఒకవేళ మీరు మీ ఫోన్‌ను పోగొట్టుకున్నారు. ఐఎంఈఐ నెంబరు తెలియకపోయినా/గుర్తులేకపోయినా దాన్ని ఇలా తెలుసుకోవచ్చు. మీ మొబైల్ నుంచి (*#06#) డయల్ చేయగానే మీ మొబైల్ నెంబరుపై దాని ఐఎంఈఐ నెంబరు ప్రత్యక్షమవుతుంది.

- ఒకవేళ ఫోన్ పోగొట్టుకుంటే.. ఫోన్ కొన్న బాక్స్ మీద లేదా కొనుగోలు చేసిన షాప్‌లో ఉన్న ఇన్వాయిస్ (బిల్) ద్వారా ఐఎంఈఐ నెంబరు సాధించవచ్చు.

బ్లాక్ చేయండిలా..

- మీరు సెకండ్ హ్యాండ్ లేదా ఓఎల్ఎక్స్ తదితర వెబ్‌సైట్స్ లేదా తెలిసిన వారి దగ్గర ఫోన్ కొనుక్కోవాల్సి వచ్చినపుడు అది దొంగిలించిందా లేదా బ్లాక్‌లిస్టులో ఉందా? అన్న విషయం మనం కేవైఎం (నో యువర్ మొబైల్) విధానంలో ముందే తెలుసుకోవచ్చు.
- ఇందుకోసం మొబైల్ తీసుకుని కేవైఎం (నో యువర్ మొబైల్) విధానంలోనూ ఐఎంఈఐ నెంబరును తెలుసుకోవచ్చు. ఇందుకోసం కేవీఎం అని పెద్ద అక్షరాల్లో టైప్ చేయాలి. అనంతరం 15 అక్షరాల ఐఎంఈఐ నెంబరును టైప్ చేసి 14422కు ఎస్ఎంఎస్ పంపాలి.
- ఇందుకోసం కేవైఎం యాప్‌ను సైతం డౌన్‌లోడు చేసుకోవచ్చు. ఇది ఆండ్రాయిడ్/ఐఓఎస్ మొబైళ్ల ప్లేస్టోర్లలో అందుబాటులో ఉంది. లేదా సీఐఆర్ వెబ్‌పోర్టల్‌లో ఆఖరుగా ఇచ్చిన ఆప్షన్ ద్వారా కూడా సెల్‌ఫోన్ తనిఖీ చేసుకోవచ్చు.

ఇక తస్కరులకు చుక్కలే

తాజా సాంకేతికత కరీంనగర్‌లో ప్రయోగాత్మకంగా ఉపయోగిస్తున్నాం. ఇప్పటికే కమిషనరేట్ పరిధిలోని అన్ని స్టేషన్ల రైటర్లకు దీని వినియోగంపై శిక్షణ ఇచ్చాం. రూరల్ పోలీసులు ఈ సాంకేతికత ద్వారా పలు ఫోన్ల జాడ తెలుసుకుని పట్టుకోగలిగారు. త్వరలో దీనిపై సెల్‌ఫోన్ వినియోగదారులకు సైతం విస్తృత అవగాహన కల్పిస్తాం. ఇక ఫోన్ కొట్టేసినా అది పనిచేయదు కాబట్టి, చోరుల ఆటలు సాగవు.
– ఎల్.సుబ్బారాయుడు, సీపీ, కరీంనగర్

సమస్యలు తెలుసుకునేందుకే వచ్చా..!

- కొప్పుల ఈశ్వర్‌కు 'తన సంక్షేమ'మే ముఖ్యం
- కేసీఆర్ మెప్పు కోసమే పనిచేస్తున్నారు
- పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో సీఎల్పీ నేత 'భట్టి'
- జిల్లాలో మాఫియాలదే రాజ్యం : శ్రీధర్‌బాబు

సాక్షి, పెద్దపల్లి: 'ఇప్పుడు ఎన్నికలు లేవు. అయినప్పటికీ కాంగ్రెస్ ఇచ్చిన తెలంగాణలో మీ సమస్యలు పరిష్కారమయ్యాయా? లేదా? తెలుసుకునేందుకు పాదయాత్రన మీ వద్దకు వచ్చా' అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర మంగళవారం ధర్మారంలోని రచ్చపల్లి, రామయ్యపల్లి మీదుగా పెద్దపల్లి నియోజకవర్గం పాలితంలోకి ప్రవేశించింది. అయితే దొంగతుర్తి, బొంపల్లి, మేరపల్లి, తెనుగువాడ, పెద్దపల్లి, హనుమంతునిపేట, రాంపల్లి వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర ఉద్రిక్తతల మధ్య కొనసాగింది.

కాంగ్రెస్ పార్టీ నిర్మించిన ప్రాజెక్టులతోనే..

ధర్మారం మండలం రామయ్యపల్లిలో భట్టి మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులతోనే రైతులకు ప్రస్తుతం సాగునీరందుతోందని, తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల ద్వారా చుక్క నీరందడం లేదన్నారు. రాష్ట్రంలో దుర్మార్గ పాలన కొనసాగుతోందన్నారు. దళితుల కోసం కాంగ్రెస్ హయాంలో ప్రత్యేక నిధులు కేటాయిస్తే.. ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను బీఆర్ఎస్ దుర్వినియోగం చేసిందన్నారు. రాష్ట్రాన్ని కేసీఆర్ రూ.5లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టారని విమర్శించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పథకాలన్నీ దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో కొనసాగాయన్నారు.

సొంత సంక్షేమం చూసుకుంటున్న 'కొప్పుల'

జిల్లాకేంద్రంలోని రాజీవ్‌చౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడుతూ.. మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజల సంక్షేమాన్ని విస్మరించి తన సంక్షేమమే చూసుకుంటున్నారని, ఆయన చేసిన అభివృద్ధి ఏమిటో చూపెట్టాలన్నారు. కవ్వాల్ టైగర్ ప్రాజెక్టు పేరుతో ఆదివాసీలను అడవి నుంచి తరిమివేశారు. మంచిర్యాల, రామగుండం ప్రజలు ఓపెన్‌కాస్ట్‌లు, సింగరేణి ప్రైవేటీకరణతో ఇబ్బంది పడుతున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కేసీఆర్ పాలనలో అమ్మహస్తం అటకెక్కిందని, రైతుబంధు ఇస్తున్నామని రుణమాఫీ అమలు చేయకపోవడం రైతులను మోసం చేయడమేనని జీవన్‌రెడ్డి అన్నారు.



మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, పక్కన గద్దర్

ఇసుక, మట్టి, మొర్రం మాఫియా..

మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. జిల్లాలో ఇసుక, మట్టి, బూడిద దందాతోపాటు మొర్రం మాఫియా కొనసాగుతోందన్నారు. ప్రజాగాయకుడు గద్దర్, డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, జెడ్పీటీసీ గంటా రాములు, జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అలరించిన గద్దర్ పాట

'మా మట్టికాళ్ల భట్టిగారు పాదయాత్ర చేస్తుండంట.. పోతవురో కేసీఆర్.. మా ఉసురు తగిలిపోతావురో..' అంటూ గద్దర్ పాడిన పాటకు కార్యకర్తలు, ప్రజల నుంచి పెద్దఎత్తున స్పందన వచ్చింది.

కొట్టుకున్న కార్యకర్తలు..

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ముందే కార్యకర్తలు కొట్టుకున్నారు. కొందరు రేవంత్‌వర్గం.. మరికొందరు మరోవర్గంగా చీలిపోయి ఎవరికి వారే పార్టీ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

అభ్యర్థి ప్రకటనతో మొదలు..

గతంలో పెద్దపల్లికి వచ్చిన రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా విజయరమణరావును ప్రకటించారు. టికెట్‌పై ఆశలు పెట్టుకున్న ఓదెల జెడ్పీటీసీ గంటా రాములు, డీసీసీ మాజీ అధ్యక్షుడు ఈర్ల కొమురయ్య, తదితరులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల సుల్తానాపూర్‌లో ధరణి సమస్యలపై రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించగా.. విజయరమణారావు అన్నీ తానై నిర్వహించారు. అలాగే విజయరమణారావు నిర్వహిస్తున్న 'ఇంటింటికీ కాంగ్రెస్'లోనూ రేవంత్ వ్యతిరేక వర్గం పాల్గొనడంలేదు. గంటా రాములు, వేముల రామూర్తి తదితరులు గోనె ప్రకాశ్‌రావుతో కలిసి బీసీ వాదం పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భట్టి పాదయాత్ర నిర్వహిస్తున్న క్రమంలో ఇరువర్గాలు బలప్రదర్శనకు దిగారు. రామగుండంలో భట్టి పాదయాత్రకు ఐఎన్‌టీయూసీ నేత జనక్‌ప్రసాద్, హర్కర వేణుగోపాల్‌వర్గం దూరంగా ఉంది.

ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకూ పోరు

కోరుట్ల: పట్టణ శివారు జంబిగద్దె ప్రాంతంలో పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకూ పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కన్వీనర్ తిరుపతి నాయక్ అన్నారు. ఇళ్లస్థలాల కోసం నిరుపేదలు చేస్తున్న పోరాటం మంగళవారం తొమ్మిదో రోజుకు చేరింది. ఈసందర్భంగా ఎంతోమంది ఇళ్లులేని నిరుపేదలు ఇళ్లకోసం ఎదురుచూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పేదలు చేస్తున్న పోరాటానికి తెలంగాణ అంబేడ్కర్ సహకార మాలకుల సంక్షేమ సంఘం మద్దతు ఉంటుందని సంఘం అధ్యక్షుడు గుమ్మడి సురేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భీముడు, భీమయ్య, బక్కన్న, ఇందూరి సులోచన, గుమ్మడి రమేశ్, హేమలత, ఉమా, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అశోక్ దంపతులకు అవార్డు



అవార్డు అందుకుంటున్న అశోక్ దంపతులు

జగిత్యాలరూరల్: పొలాస సహస్ర లింగాల దేవాలయంలో మంగళవారం పూటూరి అశోక్ బాబు–రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో వేల మంది ఏకకాలంలో అన్నపూజ కార్యక్రమం నిర్వహించారు. దీంతో వండర్ బుక్ ఆఫ్ రికార్డు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు–రమాదేవి దంపతులకు వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ కో ఆర్డినేటర్ ఎ.గంగాధర్ అవార్డు అందజేశారు.

మద్దతు ధరతో కొనుగోలు



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి/బుగ్గారం: రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తోందని ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ధర్మపురి మండలం కమలాపూర్, తీగెల ధర్మారం, బుగ్గారం మండలం బుగ్గారం, సిరికొండ, మద్దునూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. ధాన్యంలో 17శాతం తేమ ఉండాలని, ఇలాంటి వడ్లనే కొనుగోలు కేంద్రాలకు తేవాలని సూచించారు. ఎ–గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ.2,060, సాధారణ రకానికి రూ.2,040 మద్దతు ధర చెల్లిస్తున్నారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు భీమన్న, సర్పంచులు అయిల్నేని అండాలు, కొండపెల్లి లక్ష్మి, డైరెక్టర్ ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.

తండ్రి భూమిని తన పేరిట రాయాలని..

● వాటర్ ట్యాంక్ ఎక్కి తనయుడి నిరసన

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తన తండ్రి సంపాదించిన భూమిని తన పేరిట రాయాలంటూ ఓ యువకుడు వాటర్ ఎక్కి, నిరసన తెలిపాడు. ఈ ఘటన తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల్ల గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లెల్లకు చెందిన బాలసాని ఎల్లయ్య–జపమాల దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన పేరిట ఉన్న 3 ఎకరాల భూమిని భార్య తన పేరిట మార్చుకుంది. అయితే కుమారుడు రమేశ్ భూమిని తన పేరిట రాసివ్వాలని మంగళవారం స్థానిక ప్రభుత్వ పాఠశాల దగ్గరున్న వాటర్ ట్యాంక్ ఎక్కాడు. ఫోన్‌లో సెల్ఫీ ఫొటో తీసి, గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. ఇది చూసిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితుడితో మాట్లాడి, కిందకు రప్పించారు. అనంతరం అతన్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. తన తండ్రి ఎల్లయ్య పేరిట ఉన్న భూమిని తల్లి తన అక్కాచెల్లెలికి ఇచ్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించాడు. రూ.20 లక్షలు, రైతుబీమా ద్వారా వచ్చిన రూ.5 లక్షలు తల్లి వద్దనే ఉన్నాయని, ఆ డబ్బులను తాను అడగడం లేదని తెలిపాడు. గతంలో తనకు విషాహారం పెట్టి, చంపే ప్రయత్నం చేశారని, అక్క రేణుక, చెల్లి కళావతి, బావ శ్రీనివాస్‌లు తనపై దాడికి ప్రయత్నించారని, తన భార్యపై దాడి చేశారని అన్నాడు. 100కు కాల్ చేయగా పోలీసులు వచ్చి, కాపాడారని పేర్కొన్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఒకరి బలవన్మరణం

గన్నేరువరం(మానకొండూర్): మండల కేంద్రానికి చెందిన పర్శరాములు(50) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సురేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పర్శరాములు గతంలో గల్ఫ్ వెళ్లివచ్చాడు. కొన్ని రోజులుగా మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. ఈ క్రమంలో మంగళవారం ఇంటివద్ద బాత్‌రూంలో ఉరేసుకున్నాడు. మృతుడి భార్య భూలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

ఉపాధి ఉన్నా.. సౌకర్యాలే లేవు!

- మామిడి మార్కెట్‌లో వేల సంఖ్యలో కూలీలు
- ఇతర రాష్ట్రాల నుంచి కూడా వలసలు
- వసతులు కల్పించడంలో వ్యాపారుల నిర్లక్ష్యం



మామిడి మార్కెట్‌లో కాయలు ప్యాక్ చేస్తున్న కూలీలు

జగిత్యాలఅగ్రికల్చర్: చల్‌గల్‌లోని మామిడి మార్కెట్ కూలీలకు ఉపాధి మార్గంగా మారింది. మామిడి సీజన్‌లో పనిచేసేందుకు స్థానికులేకాదు.. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ నుంచి వేలాది మంది కూలీలకు ఇక్కడకు వస్తున్నారు. కానీ, వీరితో పనులు చేయించుకోవడంలో వ్యాపారులు, మార్కెట్ అధికారులు పెద్దగా ఆసక్తిచూపడంలేదు. కనీస సౌకర్యాలు కూడా కల్పించడంలేదు.

వేల సంఖ్యలో కూలీలు..

- మామిడి సీజన్ ఏటా ఏప్రిల్, మే నెలల్లో కొనసాగుతోంది.
- ఈ సమయంలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లిలో రోడ్ల వెంట వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకుని, రైతుల నుంచి మామిడి కాయ కొనుగోలు చేస్తున్నారు.
- వీటిని ట్రాక్టర్ నుంచి అన్‌లోడ్ చేసేందుకు, ఆ తర్వాత గ్రేడింగ్ చేసేందుకు, అట్టపెట్టెల్లో ప్యాక్ చేసేందుకు, ప్యాక్ చేసిన పెట్టెలను లారీల్లో లోడ్ చేసేందుకు అధిక సంఖ్యలో కూలీలు అవసరమవుతారు.
- దీనికితోడు, తోటల్లో మామిడి కాయలు తెంపేందుకు కూడా కూలీల అవసరం ఎక్కువే.
- ఈ పనులు చేసేందుకు కూలీలు స్థానికంగా ఆశించినస్థాయిలో లభించడంలేదు.
- ఇతర రాష్ట్రాల కూలీలను వ్యాపారులు రప్పిస్తున్నారు.
- ఒక్కోవ్యాపారి దుకాణంలో కనీసం 50 మంది వరకు కూలీలు పనిచేస్తున్నారు.

నెలలో రూ. 25వేల – రూ.30వేల ఆదాయం..

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీలను వ్యాపారులు వివిధ పనులకు ఉపయోగించుకుంటారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన కూలీలను మామిడి కాయలను తెంపేందుకు, లోడింగ్, అన్‌లోడింగ్ చేసేందుకు ఉపయోగిస్తారు. అలాగే, ఢిల్లీ, రాజస్థాన్ నుంచి వచ్చేవారిని కాయల గ్రేడింగ్, ప్యాకింగ్ చేసేందుకు ఉపయోగిస్తారు. కూలీలు గ్రూపుగా ఏర్పడి పనులు చేస్తుండటంతో, ఒక్కో టన్ను అన్‌లోడ్ చేస్తే వ్యాపారులు వారికి రూ.200 వరకు కూలి చెల్లిస్తారు. అలాగే, ప్యాకింగ్ చేసిన పెట్టెలను లారీల్లో లోడ్ చేస్తే రూ.3వేల –రూ.5 వేలు కూలిగా చెల్లిస్తారు. ఆ వ్యాపారి దుకాణానికి వచ్చిన కాయలను బట్టి ఒక్కో కూలీ కనీసం 30–40 రోజుల్లో రూ.25– రూ.30 వేలు సంపాదించుకుంటారు. ఆయా రాష్ట్రాల్లో వేసవి సీజన్‌లో పనులు లేకపోవడం, తిండికి కూడా ఇబ్బందులు రావడంతో మామిడి మార్కెట్‌లో పనుల కోసం జగిత్యాల వస్తుంటారు. జిల్లాకు కనీసం 5వేల నుంచి 6వేల మంది కూలీలు రాగా, ఒక్క జగిత్యాల మామిడి మార్కెట్‌లోనే కనీసం 3వేల నుంచి 4 వేల మంది వివిధ పనులు చేస్తున్నారు.

వసతులు అంతంతే..

- కూలీలతో పనులు చేయించేందుకు చూపుతున్న శ్రద్ధ, వారికి కనీస వసతులు కల్పించడంతో వ్యాపారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.
- అసలే మండే వేసవిలో మార్కెట్ సమీపంలోని వ్యవసాయ భూముల్లో ప్లాస్టిక్ కవర్లతో గుడారాలు వేసుకుని కూలీలు ఉంటున్నారు.
- షెడ్ల కింద నిద్రపోవడంతోపాటు కనీసం మల, మూత్రాలు తీర్చుకునేందుకు కూడా వసతులు లేవు. దీంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.
- తాగునీటికీ తిప్పలు తప్పడంలేదు.
- రోడ్లపక్క చెట్లకింద సేదతీరుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఏటా వస్తుంటాం



ఏటా మామిడి సీజన్‌లో జగిత్యాలకు వస్తుంటాం. నెల రోజులు ఇక్కడ పనిచేస్తాం. కనీసం రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం సంపాదించుకుంటాం. మహారాష్ట్రలో పనులు లేక ఉపాధి కోసం ఇక్కడకు వస్తున్నాం.

– నజర్‌ఖాన్, కూలీ, మహారాష్ట్ర

ప్యాక్ చేసేందుకు వస్తాం



మామిడికాయలను గ్రేడింగ్ చేసి, ప్యాక్ చేసేందుకు ఇక్కడకు వస్తున్నాం. మా రాష్ట్రం నుంచి కనీసం 500 మంది వరకు వచ్చారు. మామిడి మార్కెట్లో ఏదో పని దొరుకుతుందనే ఆశతో వచ్చి, ఎంతోకొంత సంపాదించుకుని వెళ్తాం.

– సర్వేశ్ సరోజ్, కూలీ, ఉత్తరప్రదేశ్

వసతులు కల్పిస్తాం



మామిడి సీజన్‌లో వేల సంఖ్యలో కూలీలు ఇక్కడకు వస్తుంటారు. వారికి అన్ని వసతులు కల్పించడం సాధ్యం కావడం లేదు. తాగునీరు వంటి కనీస వసతులు కల్పిస్తున్నాం. వ్యాపారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ, కూలీలకు కనీస వసతులు కల్పించాలని కోరుతున్నాం.

– ప్రకాశ్, జిల్లా మార్కెటింగ్ అధికారి

డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

జగిత్యాల : మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థలో 2023–24 విద్యాసంవత్సరంలో మూడేళ్ల డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి నరేశ్ మంగళవారం తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలికలు, తల్లి/తండ్రిని కోల్పోయిన బాలికలు, అక్రమ రవాణాకు గురైన బాలికలు, దివ్యాంగ బాలికలు ఇందుకు అర్హులన్నారు. దివ్యాంగ బాలికలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ కోర్సుల్లో 60 సీట్ల చొప్పున భర్తీ చేస్తారన్నారు. మొత్తం 240 సీట్లలో 70శాతం తల్లిదండ్రులు కోల్పోయిన బాలికలు, తల్లి/తండ్రి కోల్పోయిన నిరుపేద బాలికలకు కేటాయించారని పేర్కొన్నారు. పాలిసెట్ రాయకున్నా కనీసం పదో తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. ఎంపికైన వారికి ఉచిత విద్యతోపాటు వసతి కల్పిస్తారన్నారు. ఆసక్తి గలవారు బాలరక్షక భవన్, శ్రీరామ థియేటర్ సమీపంలోని కార్యాలయంలో సంప్రదించాలన్నారు. తగిన ధ్రువపత్రాలను జతచేసి మే 10లోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. వివరాలకు 98854 97287, 94924 60716 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

కోరుట్ల: పదో తరగతి పరీక్షలు రాసిన, పాసైన విద్యార్థులు పాలిసెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ పాలిటెక్ ప్రిన్సిపల్ రామా ప్రసాద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ ఈనెల 24 అని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు www.polycet.sbset.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోలీస్‌స్టేషన్‌లో యువతి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు యత్నించిన నిర్మల

మల్యాల(చొప్పదండి): దారికి అడ్డుగా బండరాళ్లు పెట్టిన వివాదంలో ఓ యువతి మల్యాల పోలీస్‌స్టేషన్ ఆవరణలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఎస్సై చిరంజీవి కథనం ప్రకారం.. మ్యాడంపల్లి గ్రామానికి చెందిన పంజాల నిర్మల (35) తన ఇంటి ఎదుట ప్రహరీ హద్దు వివాదం కొంతకాలంగా సాగుతోంది. నిర్మల ఇంటివద్ద దారికి అడ్డంగా బండరాళ్లు పెట్టడంతో అదేకాలనీకి చెందిన రౌతు గాయత్రి తమ ఇంటికి ఎలా వెళ్లాలంటూ ప్రశ్నించి నిలదీసింది. బూతులు తిట్టి, చంపుతానని బెదిరించింది. దీంతో గాయత్రి ఈనెల 8న నిర్మలపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది మంగళవారం దారికి అడ్డంగా ఉన్న రాళ్లగోడను తొలగించారు. దీంతో నిర్మల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి, తనఇంటి హద్దు రాళ్లగోడను పోలీసులు తొలగించారంటూ పురుగుల మందు తాగింది. వెంటనే 108 సిబ్బందికి సమాచారం అందించగా, ఈఎంటీ సతీశ్, పైలట్ మహేశ్ వెంటనే వచ్చి నిర్మలకు ప్రాథమిక చికిత్స చేసి, జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. నిర్మలపై ఇప్పటికే పలు కేసులు ఉన్నాయని, బండరాళ్లు పోలీసులు తొలగించారంటూ నిర్మల తప్పుడు ప్రచారం చేస్తోందని ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం: పొలాస గ్రామ శివారులో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని మరో బైక్ ఢీకొనడంతో ఎండబెట్ల విజయ్‌కుమార్(36) తీవ్రంగా గాయపడి మంగళవారం ఉదయం మృతిచెందాడు. సారంగాపూర్ మండలం అర్పపల్లి గ్రామానికి చెందిన ఎండబెట్ల విజయ్‌కుమార్.. పనినిమిత్తం సోమవారం జగిత్యాలకు వచ్చి రాత్రి ఇంటికి వెళ్తున్నాడు. పొలాస గ్రామ శివారులోని వ్యవసాయ కళాశాల ఎదురుగా గుర్తుతెలియని వచ్చిన ద్విచక్ర వాహనం విజయ్‌కుమార్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో విజయ్‌కుమార్ తల, కుడికాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే జగిత్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి బంధువు కొండ మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు.

పరిహారం కోసం మృతదేహంతో ధర్నా



ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు, గ్రామస్తులు

కొడిమ్యాల(చొప్పదండి): మృతుడి కుటుంబానికి పరిహారం చెల్లించాలనే డిమాండ్‌తో దొంగలమర్రి వద్ద రహదారిపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి.. చెప్యాల గ్రామానికి చెందిన ఎడవెల్లి నరేశ్(45) వృత్తిరీత్యా డీసీఎం వ్యాన్ డ్రైవర్. ఆదివారం డీసీఎం యజమాని ఖమ్మం జిల్లాకు తీసుకు వెళ్లగా సత్తుపల్లి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నరేశ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. నరేశ్ మృతదేహాన్ని మంగళవారం చెప్యాలకు తీసుకువచ్చారు. అనారోగ్యంతో ఉన్న నరేశ్‌ను వ్యాన్ యజమాని బలవంతంగా ఖమ్మం పంపించాడని, నరేశ్ కుటుంబానికి పరిహారం చెల్లించాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు రహదారిపై బైఠాయించారు. సమాచారం అందుకున్న మల్యాల సీఐ రమణమూర్తి సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అటువైపుగా వెళ్తున్న చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్ పోలీసులతో మాట్లాడి మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని సూచించారు.

హత్యకు గురైన ప్రవీణ్‌సింగ్ అంత్యక్రియలు



ప్రవీణ్‌సింగ్

కోరుట్ల: బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు ఠాకూర్ ప్రవీణ్‌సింగ్ ఆదివారం రాత్రి కొందరు యువకుల దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకు రాగా.. మంగళవారం రాత్రి అంత్యక్రియలు నిర్వహించారు. ఠాకూర్ ప్రవీణ్‌సింగ్‌పై దాడి చేసి ఆయన మృతికి కారకులైన పి.రాహుల్, బి.సాగర్, పి.రాజేశ్, వెంకటేశ్, శశిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిపై హత్య కేసు నమోదు చేశారు. ప్రవీణ్ మృతికి బీజేపీ నాయకులు జేఎన్ వెంకట్, సురభి నవీన్, శీలం వేణు సంతాపం తెలిపారు.

భూమి విషయంలో గొడవ.. ఇద్దరిపై కేసు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని సేవాలా ల్ తండాలో గొడవ పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ధరంసోత్ బాల్‌రెడ్డి నాయక్, రవి నాయక్‌లు భూమి విషయంలో మంగళవారం గొడవ పడ్డారు. వీరిలో బాల్‌రెడ్డి నాయక్ ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితులు పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

వెల్గటూర్(ధర్మపురి): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం మంత్రి పర్యటించారు. కిషన్‌రావుపేట, శాఖాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. మద్దతు ధర కల్పిస్తూ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, జెడ్పీటీసీ బి.సుధారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, సింగిల్‌విండో చైర్మన్ గోళి రత్నాకర్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్, ఏపీఎం చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మందుబాబుల వీరంగం



బస్టాండ్‌లో మద్యం సీసాల గాజుముక్కలు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో మందుబాబులు సోమవారం రాత్రి హల్‌చల్ చేశారు. బస్టాండ్‌లోనే చిత్తుగా మద్యం తాగి బీరుసీసాలు పగులగొట్టారు. సమీపంలోనే వైన్స్‌షాప్ ఉండటంతో అక్కడ మద్యం కొనుగోలు చేసుకుని వచ్చి బస్టాండ్‌ను అడ్డాగా చేసుకుని తాగుతున్నారు. అంతటితో ఆగకుండా ఖాళీ బాటిళ్ల పగులగొడుతున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

చెరుకు పంట దగ్ధం



దగ్ధమైన చెరుకు పంట

రాయికల్(జగిత్యాల): సింగరావుపేట గ్రామంలో జాజాల రవి అనే రైతుకు చెందిన నాలుగెకరాల చెరుకు పంట మంగళవారం ప్రమాదవశాత్తు నిప్పు అంటడంతో దగ్ధమైంది. జగిత్యాల నుంచి వచ్చిన అగ్నిమాపక అధికారులతోపాటు స్థానిక రైతులు నీళ్లుచల్లి మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. సుమారు రూ.6 లక్షల వరకు పంటనష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాలుడిని అప్పగిస్తున్న పోలీస్

కోరుట్ల: పట్టణంలోని ఆనంద్‌నగర్‌కు చెందిన బాలుడు పొట్టవత్తిని మణిదీప్ మంగళవారం తప్పిపోయాడు. ఈమేరకు స్థానికులు ఎస్సై సతీశ్‌కుమార్‌కు సమాచారం అందించారు. ఎస్సైతోపాటు, బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ రాజేశ్వర్‌రావుకు సమాచారం ఇచ్చారు. దీంతో బాలుడి ఆచూకీ తెలుసుకున్నారు. బాబుని అతడి పెద్దనాన్నకు అప్పగించారు. పోలీసులను స్థానికులు అభినందించారు.

ఫ్యాక్టరీ రద్దుకు సహకరించండి



వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

వెల్గటూర్(ధర్మపురి): కాలుష్య కారక ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దుకు సహకరించాలని కోరుతూ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి పలువురు గ్రామస్తులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తిలో భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర వద్దకు వెళ్లిన గ్రామస్తులు.. ఈ మేరకు వినతిపత్రం సమర్పించి తమకు సహకరించాలని కోరారు. ఇందుకు కాంగ్రెస్ నాయకులు సానుకూలంగా స్పందించినట్లు పల్లెవాసులు తెలిపారు.

రోడ్డు అలైన్మెంట్ మార్చాలి

కొడిమ్యాల(చొప్పదండి): హన్మకొండ – కరీంనగర్ – జగిత్యాల ఎన్‌హెచ్– 563 రహదారి విస్తరణ అలైన్మెంట్‌కు కొడిమ్యాల మండలంలో మార్పులు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఎంపీ బండి సంజయ్‌కి లేఖ రాశారు. రోడ్డుకు ఇరువైపులా భూములు సేకరించాల్సి ఉండగా, ఒకేవైపు సేకరించేందుకు సర్వే చేస్తున్నారని ఆరోపించారు. దీనిద్వారా పూడూరు గ్రామ రైతులు రూ.కోట్ల విలువైన వ్యవసాయ భూములు కోల్పోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా మక్కలు కొనుగోలు చేయాలి

జగిత్యాలటౌన్: మార్క్‌ఫెడ్ ద్వారా మక్కలను మద్దతు ధరతో కొనుగోలు చేయాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కోరారు. ఈమేరకు సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు.

ఎమ్మెల్యేకు పరామర్శ

జగిత్యాలటౌన్: ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సతీమణి రాధిక తల్లి విజయమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి.. మంగళవారం సంజయ్‌ను పరామర్శించారు.

రైతును కాటేసిన కరెంట్



బొడ్డు గంగారెడ్డి మృతదేహం

మల్లాపూర్(కోరుట్ల): జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం సాతారం గ్రామానికి చెందిన రైతు బొడ్డు గంగారెడ్డి(60) మంగళవారం సాయంత్రం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొడ్డు గంగారెడ్డికి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారికి గతంలోనే వివాహం జరిపించారు. అయితే గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో ఈ యాసంగిలో వరి సాగు చేశాడు. పొలానికి నీరుపెట్టేందుకు వెళ్లిన గంగారెడ్డి.. వ్యవసాయ బావి వద్ద మోటార్ స్విచ్ ఆఫ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై నవీన్‌కుమార్, పోలీస్‌సిబ్బంది, ట్రాన్స్‌కో ఏఈ శివకుమార్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడితో భేటీ

- తక్కళ్లపెల్లిలో అనుమానాస్పద స్థితి మృతిపై విన్నవించిన నాయకులు



ప్రవీణ్‌కుమార్‌తో నాయకులు

కథలాపూర్(వేములవాడ): తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ బొడ్డు సాగర్ అనుమానాస్పద స్థితి మృతిపై బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. మండలానికి చెందిన బీఎస్పీ నాయకులు మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌ను హైదరాబాద్‌లో కలిసి సమస్యపై చర్చించారు. ఈనెల 9న బొడ్డు సాగర్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందితే ఇప్పటివరకు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకోలేదన్నారు. మృతికి కారణమైన అధికార పార్టీ నాయకుడిపై చర్యలు తీసుకోవడానికి పోలీసులు వెనుకంజ వేస్తున్నారని ఆరోపించారు. బడుగు, బలహీన వర్గాలపై దౌర్జన్యాలు జరుగుతున్నా పట్టించుకోవడంలేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ నేత చాకలి వెంకటేశ్, మండల అధ్యక్షుడు తెడ్డు శేఖర్, నాయకులు బాలె నీలకంఠం, పాడేటి అర్జున్, బాలె మహేశ్, పాలెపు సంజీవ్, గణేశ్, గోపి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'జనశక్తి' సాగర్ ఉద్యమ ద్రోహి

● జనశక్తి అగ్రనేత కూర రాజన్న



మాట్లాడుతున్న జనశక్తి అగ్రనేత కూర రాజన్న

సిరిసిల్ల: సీపీఐ(ఎంఎల్) జనశక్తి మాజీ రాష్ట్ర కార్యదర్శి సాగర్ అలియాస్ సత్యం, ఎడ్ల లక్ష్మీరాజం ఉద్యమ ద్రోహి అని ఆ పార్టీ అగ్రనేత కూర రాజన్న అలియాస్ రాజేందర్ అన్నారు. సిరిసిల్ల కోర్టు ఆవరణలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కామారెడ్డిలో ఇంకో కేసు తనపై నమోదైందని, అందుకు సాగర్ కారకుడని ఆరోపించారు. 18 ఏళ్ల కిందట పార్టీలో పని చేసిన సాగర్ జనశక్తి పార్టీకి రాజకీయంగా, ఆర్థికంగా నష్టం చేశాడని అన్నారు. కామారెడ్డి బీడీ కంపెనీ యజమాని శ్రీశైలంతో సాగర్‌కు ఆర్థిక సంబంధాలు ఉన్నాయని, ఆయన ఆ కంపెనీలో భాగస్వామి అయి ఉంటాడని పేర్కొన్నారు. ఈ కేసులో కామారెడ్డి పోలీసులు పొరపాటు చేశారని, తాను చంచల్‌గూడా జైలులో ఉండగా.. పరారీలో ఉన్నట్లు ఎఫ్‌ఐఆర్‌లో చూపాలరని తప్పుపట్టారు. ఇది ఒక్కటి చాలదా..! ఇది ఫేక్ కేసని కొట్టేయడానికి అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆ కేసును కొట్టివేయాలన్నారు. ఆ కేసులో అరెస్ట్ అయిన మరో వ్యక్తి జక్కుల యాదగిరి తనకు తెలియదని, సిరిసిల్లలో అమరుడైన జక్కుల ఎల్లన్న మాత్రం తనకు తెలుసని వివరించారు. తనపై పోలీసులు సుద్దాల ప్రభాకర్‌రావు హత్య కేసు లాంటి అనేక తప్పుడు కేసులు పెట్టారని ఆయన అన్నారు. ఆయన వెంట రాజన్న సోదరుడు కూర దేవేందర్ అలియాస్ అమర్, విమలక్క, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు తదితరులు ఉన్నారు.